




# ఆదివిష్ణు

చలపతి చాలా సంతోషించాడు. అంత సంతోషం గత రెండుసంవత్సరాల్లోనూ చవిచూచి ఎరుగడు. చెల్లాయి పెళ్లిరోజున కలిగిన సంతోషాని కంటె ఎక్కువగా సంతోషించాడు. ఒక్కసారిగా రెక్కలు కట్టుకుని స్వంత ఊళ్లోకి ఎగిరిపడి నట్టూ, ముసలి తల్లికి కబుర్లు చెప్తున్నట్టూ, తమ్ముడికీ, చిట్టి చెల్లాయికీ పాఠాలు చెప్తూ న్నట్టూ, చిన్ననాటి మిత్రులందరితోనూ తనివి తీరా బాతాఖానీ వేస్తున్నట్టూ వూహించేశాడు.

ఎక్కడి బందరు ? ఎక్కడ విశాఖపట్నం ? ఎన్నాళ్లనుంచో, ఉద్యోగంలో కాలుపెట్టి విశాఖ పట్నం వచ్చిందగ్గర్నుంచీ అనుకుంటాడు — ఎప్పుడు స్వంత ఊళ్లో ఉద్యోగంచేసే అదృష్టం కలుగుతుందాని.

అది నేటికి నిజమయినట్టు సంతోషించాడు.

సహపాఠి, సహృదయుడు, ఆదర్శవాది అయిన శంకరం తనకి ఆఫీసరుగా వస్తున్నాడంటే అంతకు మించిన సదవకాశమింకేముంది ? ఇన్నాళ్లూ కనిన కలలకి ఒక రూప మివ్వబోతున్నాడు శంకరం.

ఆఫీసరు హోదాలో ఉన్న శంకరానికి తన మనవి చెప్పుకోవాలి. ఏవిధంగానైనా తన స్వంత ఊరికి బదిలీచేసే ఏర్పాటు శంకరం చేతుల మీదుగానే జరిపించాలి. ఒక స్నేహితుడు ఈనాడు తనకి ఆఫీసరై ఇంత సహాయం చెయ్యబోతున్నా డంటే అంతకంటే గర్వించదగ్గవిషయం ఇంకే ముంటుంది ?

ఇన్నాళ్లూ చలపతి తనవాళ్లందరికీ దూరంగా ఉద్యోగంచేస్తూ ఆ వచ్చే నాలుగురాళ్లూ — తన కింద కొంత ఖర్చుపెట్టుకొని ఎలాగోలా కొంత మిగిల్చి పంపుతూండేవాడు. ఆర్థికంగా చాలా ఇబ్బంది పడ్డాడు ఇన్నాళ్ళ.

ఇంక తనకి సుఖం దగ్గరయ్యే సూచనలు కను పిస్తున్నాయి. స్వంత ఊళ్లో ఉద్యోగం చేస్తూ, సంసారాన్ని ఏ వడిదుడుకూ లేకుండా జరుపుకో వచ్చు. ఆరోజు చలపతికి కనపడ్డ ప్రతి పరిచ యస్థుడితోనూ పనిగా చెప్పుకున్నాడు — శంకరం తనకి ఆఫీసరుగా వస్తున్నాడని. ఆఫీసులో తోటి గుమాస్తాలు చాలామంది సంతోషించారు. మరి కొందరు చాటుగా చలపతికి పట్టబోయే అదృష్టా నికి ఈర్ష్యచెందారు.

ఏది ఏమైనా చలపతి ఆనందాని కారోజు పట్ట పగ్గాల్లేకుండా పోయాయి.

హోటల్లో వేసిన విస్తరిముందు కూర్చుని దాన్లో వడ్డించిన పదార్థాలవైపు కసిగా చూశాడు. అమ్మ తనకోసం చేసే వంటకాలు పేరుపేరునా మననంచేసుకున్నాడు. మళ్లీ అంత అదృష్టం అతి త్వరలో కలుగబోతున్నందుకు సంతోషించాడు.

తను అద్దెకుంటూన్న గది అనబడే కారా గారంవంక తీక్షణంగా చూచి తనలో తాను అనుకున్నా డిలా — 'ఇంతవరకూ గదిలో ఒంటరిగా ఏం తోచక, నా వాళ్ల నందరినీ తల్చుకుని కుమిలి పోయాను. యమయాతన అనుభవించాను. మా శంకరం దయవల్ల మళ్లీ మా ఇంట్లో అందరి మధ్యా రాజాలాగా ఉండటానికి నోచుకోబోతు న్నాను. ఇదే చాలు నాకు !'

రాత్రి తొమ్మిదిగంటలకి లోజు మాదిరి గప్‌చిప్‌గా నిద్రపోవాలనిపించలేదు చలపతికి.

# ఎండమావులు

రేపు సాయంత్రం కొత్త ఆఫీసరు శంకరం వస్తున్నాడు. 'రేపు సాయంత్రం' కనుపించటానికి ఎలా లేదన్నా ఇరవై గంటలపాటు వేచి ఉండాలి గాబోలు ఖర్మం. చలపతికి చిరాకు కలిగింది.

ఆరాత్రి ఎంత త్వరగా తెల్లవారితే అంత బావుం డనిపించింది అతనికి. ఒక్కో గంట ఒక్కో రోజులా గడుస్తున్న ట్లనిపించింది. పన్నెండయినా అతను నిద్రపోలేదు.

సిగరెట్టు ముట్టించి కాలేజీరోజులు గుర్తు చేసుకోడం మొదలెట్టాడు.

శంకరం ఇప్పు డెలా ఉంటాడోగాని, చదువు కుంటూన్న రోజుల్లో సన్నగా, పచ్చగా, ఎత్తుగా ఉండేవాడు. శంకరం చాలా అందంగా ఉంటాడు.

అత నెంత అందంగా ఉంటాడో, అంత అందంగానే ఉంటుంది అతని హృదయం! కాలేజీలో అతను అందరు విద్యార్థులకీ మార్గదర్శిగా ఉండేవాడు. తనకున్న అభిరుచుల్ని నిర్భయంగా అందరికీ చెప్పుకునేవాడు. ఆదర్శం అతనికి మరో ప్రాణం.

డిబేట్సులో అత నెప్పుడూ నెగ్గుతూండేవాడు. వరకట్నాలు, ప్రేమ వివాహాలూ, ఒక్క టేమిటి —అతను చెప్తున్న ప్రతివిషయమూ నిజానికి చాలా దగ్గర్లో ఉండేది. పైగా — ప్రతి సమస్యకీ అతను తెలివిగా, 'విరుగుడు' చెప్పేవాడు. దారులు చూపేవాడు. అతని ఆదర్శం కేవలం డిబేట్సు నిమిత్తమే అన్నట్లుండేది కాదు — చేతల్లోనూ చూపించేవాడు.

రాధతో శంకరం పెళ్లవటానికి అతనికున్న ఈ అర్హతే ముఖ్యకారణం.

రాధకి శంకరమంటే సదభిప్రాయం. శంకరం మంచి వక్త, మనసులు చదవగల నేర్పరి. తన చుట్టూ ఉన్నవాళ్ల శ్రేయస్సు కోసం శ్రమించే యువకుడు. ఒక మంచి కథలో సకలగుణసంపన్నుడగు కథానాయకుడ్ని నిజజీవితంలో చూచినట్లవుతుంది, శంకరాన్నీ, అతని ఆశయాల్నీ గమనిస్తూంటే. అందుకే రాధకి శంకరమంటే మనసు.

రాధలాటి లక్షాధికారిబిడ్డకి, శంకరంలాటి ఆదర్శయువకుడు భర్తగా లభించడం ఏనాటి పుణ్యమో మరి!

నిజానికి రాధపెళ్లి చలపతితో జరగాల్సింది. కాని విధి ఆమె అదృష్టాన్ని వమ్ముచెయ్యలేకపోయింది. బలేచిత్రంగా రాధ పెళ్లి శంకరంతో జరిగింది. ఆ సంఘటన లన్నీ తలుచుకుంటూంటే పతం తన కళ్లముందు కదుల్తున్నట్లుంది.

చలపతి చదువుకుంటూన్న రోజుల్లోనే అతని తండ్రి పోయాడు. తల్లి మానసికంగా గాయపడింది. ఇద్దరు చెల్లాయిలూ, తమ్ముడు, తను —వీళ్లందర్నీ దృష్టిలో పెట్టుకుని ఆమె ధైర్యాన్ని వహించింది. కాని లోలోపల ఆమె కుళ్లిపోని రోజు లేదు.

చదువు మానేద్దామనే నిశ్చయానికి వచ్చాడు చలపతి. దానికొంత కారణం ఆర్థిక దుస్థితి. తండ్రిలేని లోటేమిటో అతనికి బాగా తెలిసింది. తన చదువు తన కుటుంబానికి బాధకలిగించటం మినహా కించిత్తు మేలుచెయ్యలేదు.

ఈ నిశ్చయంతోనే అతను నెలరోజులపాటు కాలేజీకి వెళ్లలేదు. ఈ విషయం రాధ సీతారామయ్యగారికి చెప్పింది. కూతురు చెప్పింది విని ఆయన నిశ్చేష్టులయ్యారు. సీతారామయ్యగారికి వ్యాపారంలో బాగా కలిసి వచ్చింది. ఆయన ఆప్తమిత్రుడూ, అతి సన్నిహితుడూ ఎవరైనా ఉంటే వారు చలపతితండ్రి ఒక్కరే!

సీతారామయ్యగా రొకసారి చలపతియింటికి వచ్చారు. అతని చదువుగురించి అడిగారు. రాధ చెప్పినట్టే అతనూ చెప్పాడు. సీతారామయ్యగారతని పరిస్థితులు అర్థంచేసుకున్నారు. చలపతికి ధైర్యం చెప్పారు. మిగిలిన ఈ కాస్త చదువూ పూర్తిచెయ్యటానికి తను చేతనయినంతవరకూ సహాయంచేస్తాననీ, ఇది కేవలం

---

ఒక ఖైదీపైన పెద్ద నేరం ఆరోపించబడింది. అతని తరఫున వాదించేందుకు న్యాయవాది లేడు.

"నీ మీద వచ్చిన ఆరోపణ తీవ్రమైనది. నువ్వు న్యాయవాదిని ఎందుకు పెట్టుకోలేదు?" అని జడ్జి అతడ్ని అడిగాడు.

"నిజమేనండీ!" అంటూ ఖైదీ జడ్జి వైపు వంగి, "కాని జూరీ సభ్యులలో కొందరు నా మిత్రులు" అని రహస్యంగా అన్నాడు.

వి. రాజగోపాల్ (గుడివాడ)

---

ఒక ఆప్తమిత్రుడి కుటుంబానికి చేయవలసిన కనీస ధర్మంగా భావించమని చలపతితో చెప్పా రాయన.

సీతారామయ్యగారి అండనే అతని చదువు సాగింది!

రాధంటే చలపతికి గౌరవమైన భావ ముంది. ఆమె ఏమాటనీ దాచుకునేది కాదు. అలా అని ఎడా పెడా అర్థంలేకుండా వాగేసేదీ కాదు. తను మాటాడే ప్రతిమాటకీ విలువకడుతుంది. ఏది మాటాడినా తర్జనభర్జన చేసుకోనిదే మాటాడేది కాదు.

సీతారామయ్యగారి ఉదారస్వభావం, విశాల దృక్పథం — ఈ రెండూ రాధని మూర్తీభవించాయి. ఆమెకి తండ్రిగారి పోలికలబ్బినాయి. అందుకే రాధని గౌరవంగా చిత్రించుకునేవాడు చలపతి.

సీతారామయ్యగారి ప్రోద్బలంవల్ల రాధతోపాటే చలపతి వా రింట్లోనే చదువుకునేవాడు. రాధ చదువువిషయంలో చలపతికంటె ఓ మెట్టు పైనే ఉండేది. తనకి అర్థంకాని పాఠాన్ని చాలా చక్కగా చెప్తుండేది ఆమె. ఒకవిధంగా చూస్తే —క్లాసులో లెక్చరర్లు చెప్పే పాఠాలకన్నా, ఇంటి దగ్గర రాధ చెప్తుంటేనే బాగా అర్థమయినట్టుండేది అతనికి.

చదువులో రాధని ఎదుర్కొనేవారు బహు అరుదు. వారిలో ముఖ్యుడు శంకరం. అటు శంకరం, ఇటు రాధా — ఇద్దరూ కాలేజీకి రెండు కళ్లలా ఉండేవాళ్ళు. అందరికీ అభినందనీయులైనారు. లెక్చరర్లు మొదలు విద్యార్థుల వరకూ — అందరికీ ఈ ఇద్దరిపైనా గౌరవభావం కలిగింది.

ఒకనాడు — చలపతి చదువుకునేందుకు సీతారామయ్యగారింటికి వచ్చాడు. అప్పటికి రాధ యింకా రాలేదు. ఇద్దరిమధ్యా లోకాభిరామాయణం కదిలింది. ఆ రామాయణానికి వక్త సీతారామయ్యగారు, శ్రోత చలపతీను. తన తండ్రితో ఆయనకున్న స్నేహంతో ప్రారంభించి రాధపెళ్లి విషయంవరకూ మాటాడారు సీతారామయ్య.

"నాకో కోరిక ఎన్నాళ్ల నుంచో ఉంది చలపతీ! దానికి నువ్వు 'ఆదర్శం' అని పేరుపెడితే అది పొరపాటవుతుంది. నాకున్న స్నేహితులు బహు కొద్దిమంది. వాళ్లందరిలోనూ మీ నాన్నంటేనే నాకు ప్రాణం. ఇద్దరమూ ఒక్క క్షణమైనా వదిలి ఉండేవాళ్లం కాము మొన్న మొన్నటివరకూ. ఇప్పుడు వాడు నాకు దూరమయ్యాడు. చెప్పానుగా మీ నాన్నంటే నాకు ప్రాణమని. అలాంటి నాప్రాణం కోసం నే నేంచేసినా తక్కువే అవుతుందనుకుంటాను. అదృష్టవశాత్తూ కలిసివచ్చిన ఈ అంతస్థుకి దాసుడనై మా స్నేహాన్ని తెంచుకోలేదు నేను. ఈ గర్వం నా కెప్పటికీ ఉంటుంది.

నాకో కోరిక ఉంది—మన్నైనా, మీ నాన్నైనా నాకు ఒక్కటే. మీబాగే నాకు కావలసింది. రాధ ఒక్కర్తె నాకు సంతానం. నీ సంగతి నాకు బాగా తెలుసు. ముఖస్తుతి అప్రస్తుతమనుకుంటాను. మా రాధకి తగిన వరుడివి నువ్వే చలపతీ!"

చలపతి ఉలిక్కిపడ్డాడు!

"ముందే అన్నాను యిదంతా ఆదర్శం పేరుతో నేను చెయ్యడంలేదని. నా ప్రాణంలాటి మిత్రుడి కుటుంబాన్ని తరతరాలపాటుగా నాకు దగ్గర చేసుకోవడమే నా అభిమతం. ఈ వాంఛని మా స్నేహానికున్న ప్రతిబింబంగా గమనించు. నేను లక్షాధికారినన్నమాట మరచిపో. నా కోరిక తీర్చేందుకు అవకాశమివ్వు చలపతీ!"

చలపతి ఏం మాటాడలేకపోయాడు. ఈ మౌనాన్నే ఆయన అంగీకారంగా భావించారు.

"నాకు తెలుసు. నామాట కాదనలేవు నువ్వు. చాలా సంతోషం నాయనా" అని ఆయ నంటూండగానే రాధ ఇంట్లో అడుగుపెట్టింది నవ్వుకుంటూ.

"రాధా! చలపతి వచ్చి చాలాసేపయింది. పరీక్షలుగూడా దగ్గరపడుతున్నాయి. ఇంకా నువ్వితే

షికార్లు చేస్తూంటే గెస్టెక్కడం చాలా కష్టం. చలపతిని చూచైనా నేర్చుకో. త్వరగా భోంచేసి చదువుకో" అని ఆమెని చిన్నగా మందలించి ఆయన పడకగదివైపు వెళ్ళిపోయారు.

రాధ చలపతివైపు చూచింది క్షమించమన్నట్టు.

"నీకోసం లాస్టవరయింతర్వాత వెదికాను. కాని యువ్వసలు కనిపించనేలేదు." అన్నదామె.

"చెల్లాయికి సుస్తీగా ఉందంటే మందు కోసం వెళ్ళాను."

"మన కాలేజీడేకి నాటకం వేస్తున్నాం. ఆ నాటకాన్ని శంకరం స్వయంగా రాశాడు. నేనూ ఏక్టు చేస్తున్నా."

చలపతిఅర్థంకానట్టు ఆమెవైపు చూశాడు.

"ఎంచక్కగా ఉందనుకున్నావ్ నాటకం. హబ్బ .... చెప్పలేనంత బావుంది. శంకరం హీరో—నేను హీరోయిన్ని. నీకూ ఒక రోల్ యివ్వా లనుకుని నీకోసం వెదికాం."

చలపతిగుండెల్లో ఎవరో చెయ్యిపెట్టి కెలికి నట్టయింది.

"నువ్వూ వెయ్యాలి."

"నాకు నాటకాలెయ్యడం చాతకాదు."

"ఇందులో చేతొచ్చే దేముందీ ? నేను మాత్రం యింతకుముందు వేశానేవిటీ మరీను."

"అదికాదు రాధా ! మీ రిద్దరూ నాటకాల ద్వారా కాకపోయినా, మరోవిధంగానైనా స్టేజీ ఎక్కి పదిమందిలో నిర్భయంగా మాటాడడం అలవాటుచేసుకున్నారు. నాలాటివాడు స్టేజీ ఎక్కితే నవ్వులపాలవడం తథ్యం."

"కొత్తలో అలాగే అనిపిస్తుంది. నాలుగు రిహార్సల్సు జరిగితే అదే పోతుందిలెద్దూ."

"అయినా నావల్లకాదు రాధా ! స్టేజీ ఎక్కడమంటేనే నా కాళ్ళు గజగజలాడతాయి."

"సరే .... నీ యిష్టం." చివరికి అన్నది రాధ. రెండు క్షణాల తర్వాత "మేడమీదకెళ్ళు .... యిప్పుడే క్షణంలో వచ్చేస్తా" నంటూ ఆమె తన గదిలోకి వెళ్ళిపోయింది.

చలపతి పుస్తకాలు తీసుకుని మేడమీద గదిలోకి వెళ్ళాడు. పుస్తకం తెరిచాడు చదువుకునేందుకు. కాని చదవ బుద్ధిపుట్టలేదు.

శంకరంతోపాటు రాధ నాటకం వేస్తోంది. అతను హీరో, రాధ హీరోయిను నూను. ఈ సంగతి సీతారామయ్యగారికి తెలుస్తే ? ఆయ నేమనుకుంటారు ? అయినా రాధ నాటకా లెయ్యడ మేమిటీ!

సీతారామయ్యగారి ఉద్దేశాన్ని యింతకుముందే విన్నాడు చలపతి. ఆయన అభిప్రాయాన్ని వినక ముందు చలపతి కలలోనైనా వూహించలేదు రాధని తనకిచ్చి పెళ్ళిచెయ్యటానికి ఆయన యిష్టపడుతున్నారని. ఇప్పుడేమో రాధ మరో కుర్రాడితో కలిసి కాలేజీ ఆడిటోరియంలో అందరి ముందూ నాటకం వెయ్యబోతోందని తెలిస్తే ఆయనమనస్సు కష్టపడదూ ?

ఆయనకున్న అభిప్రాయాన్ని తనతో యిప్పుడు చెప్పకపోయినా బావుండే దనుకున్నాడు చలపతి. ఈ విషయమ్మై—యింత ఆలోచించే అవసరం కలిగేది కాదు.

రాధ వస్తూన్నట్టు మెట్ల మీద చప్పుడయింది. పుస్తకంలో తల దూర్చి శ్రద్ధగా చదువుకుంటున్నట్టు నటించాడు చలపతి. ఆమె లోపలికొచ్చి కుర్చీని టేబిలుకి దగ్గరగా లాక్కుని కూర్చుంది.

"ఏం చదువుదాం ?"

"ఎకనామిక్సు చదువుదాం. ఒకసారి 'రెంటు' గురించి చెప్పు. క్లాసులో సరిగ్గా అర్థంకాలేదు."

"నీ కెప్పుడు అర్థమయిందనీ యిప్పుడు అర్థమవటానికీ ! సరె .... కానివ్వు." అని ఆమెకూడా ఎకనామిక్సు తీసింది. పాఠం చెప్పటానికి ముందుగా ఆమె యిలా అన్నది.

"శంకరం మీ మగవాళ్ళందరిలోనూ బాగా చదువుతాడు."

అవునన్నట్టు తలూపాడు చలపతి.

"నువ్వెందు కలా చదవకూడదూ ?"

"అతను బ్రిలియంటు."

---

"సుమారు 30 సార్లు జైలు కెళ్ళినా నీ వింకా దొంగతనాలు మానలేదే!" ఆశ్చర్యం ప్రకటించాడు న్యాయమూర్తి మళ్ళీ అంజిగాడిని బోనులో చూచి.

"మీరు చెప్పింది అబద్ధం కాదండీ. అయినా పొరపాట్లు ఎవరికి రావు కనక!" అన్నాడు అంజిగాడు అమాయకంగా.

టి. వి. ప్రసాద్ (బందరు)

---

"ఏం కాదు. కృషి. ప్రతిదానికీ అతను కృషి చేస్తాడు. అందుకే అతనలా పైనవుతున్నాడు."

చలపతి పుస్తకంలో చూపు నిలిపాడు.

"శంకరంగురించి నీ అభిప్రాయ మేమిటి చలపతీ ?"

హఠాత్తుగా ఆమె అడిగినదానికి వెంటనే జవాబివ్వలేకపోయాడు.

"అతనెలాంటివాడని అడుగుతున్నాను."

"చాలా మంచివాడు."

"అది అందరికీ తెలిసిందేగదా."

ఇంకేం చెప్పనూ అన్నట్టు చూశాడు చలపతి.

"అతనిలో ఒక గొప్పతనం గమనించతగ్గది. అత నెవరికీ భయపడడు. అతని ఆశయాలని నెరవేర్చుకునేందుకు స్వయంగా మార్గాలు సృష్టించుకొంటాడు. అవాంతరాలకు లొంగిపోని దిట్ట. కదూ."

'అవును."

"మరో గమ్మత్తేవిటంటే, నేనేది కావాలని అనుకుంటానో, సరిగ్గా అతనూ అదే కావా లనుకుంటాడు. చాలా విషయాల్లో మే మిద్దరమూ పరిభవిస్తూంటాం. అందుకే అతనంటే నా అభిమానం."

"రాధా ! యిప్పుడు మనం ఎకనామిక్సు చదవాలి.

"ఎప్పుడూ చదువు, చదువు, చదువూ ! !
రెంత చదివినా అతన్ని మించలేరు."

"కావచ్చు."

"వచ్చేవిటి మధ్య ! పైగా అతనంటే మీల
కొందరికి ఈర్ష్య కూడాను."

"ఎవరన్నా రా మాట ?"

"ఒకరనా లేవిటీ ? అతనిమీద మీరెంత అ
మానం పొలకబోస్తున్నా, వో మూల అక్కస
రగుల్తూనే ఉంటుంది."

"అతను నాకు మంచి స్నేహితుడు."

"నీ ఒక్కడిగురించి కాదు నే చెప్తూంట
ఇందాక ఎవడో ఒక కూత కూశాడులే. మేం ప్రద
ర్శించబోయే నాటకంలో ఎవరెవర్ని తీసుకుందామా
మాటాడుకుంటూంటే, మనక్లాసువాడే, ఎప్పుడూ
ఆ వెనకబెంచీల్లో నిద్రపోతూంటాడు చూడు మెల్ల
కన్నూ వాడూను .... వాడు. మేమట ప్రేమైకజీవ
లంట, త్వరలో కాబోతూన్న వధూవరులంట."

చలపతి ఆశ్చర్యపోయాడు.

"నాకు తెలుసు చలపతీ ! ఎవరైనా అభివృద్ధిలోకి వస్తున్నారంటే వాళ్ళని చూచి ఏడ్చేవాళ్ళు చాలామంది ఉంటారని."

క్షణం ఆగి, తిరిగి ఆమే అన్నది.

"మే మొకవేళ పెళ్ళి చేసుకోబోతూన్నా ఈ వెధవాయిల ముచ్చట చెల్లించాలనిమాత్రం కాదు."

"అంటే నీ ఉద్దేశ్యం ?"

ఆమె పుస్తకంలోకి చూస్తూ అన్నది.

"ఇంతలో ఏ ఉద్దేశానికీ రాలేదుగానీ, ఏమో .... ఎవరు చెప్పగలరూ! మేము నిజంగా పెళ్ళి చేసుకోబోతామేమో !"

చలపతికి సీతారామయ్యగారి మాటలు గుర్తుకొచ్చాయి. అతను లోలోపల కొంచెం భయపడిన మాట వాస్తవం.

"శంకరం ఈనాటి యువకుల్లో మణిపూస! అలాంటివారు ఎక్కడో కోటికీ, నూటికీ ఒక్కరుంటారు."

ఆరోజు ఎకనామిక్సు ఏమీ చదవలేదనే చెప్పాలి. శంకరంగురించే ఆమె ఎక్కువగా మాటాడింది. చలపతి మౌనంగా వినడం మినహా మరేం చెయ్యలేక పోయాడు.

వారం రోజులు గడిచాయి. ఆనాడు చలపతి సీతారామయ్యగారింటికెళ్ళేసరికి రాధని సీతారామయ్యగా రిలా కేకలు వేస్తున్నారు. గుమ్మంలో నిలబడి అంతా విన్నాడు చలపతి.

"అయినా నిన్ను నాటకాలు వెయ్యమని ఎవరు చెప్పారు. ఎవరిచ్చా రా అధికారం ?" ఆయనంత గట్టిగా మాట్లాడ్డం అదే మొదటిసారిగా విన్నాడు చలపతి.

"అధికారమివ్వవలసిన అవసరం దాన్లో ఏముంది గనుక. కాలేజీ వార్షికోత్సవంలో మా అందరికీ బాధ్యత ఉంటుంది. తప్పేముంది ?"

"వయసుకొచ్చిన పిల్లవు, పరాయి కుర్రాడితో నాటకాలు వెయ్యటం ఏమైనా సబబా ?"

"అతనేం పరాయివాడు కాడే." రాధకి అంత

ధైర్యం ఎలా కలిగిందా అని ఆశ్చర్యపోయాడు చలపతి.

"అంటే నీ అభిప్రాయం ?"

"అతన్ని పెళ్లిచేసుకోబోతున్నాను."

తండ్రీ కూతుళ్లమధ్య దుమారం రేగింది. ఇలాంటి సమయంలో వాళ్లకంటపడటం అతని కిష్టంలేదు. అందుకనే వెనుతిరిగి గబగబా యింటి కొచ్చేశాడు చలపతి.

మరునటిరోజు సీతారామయ్యగారే స్వయంగా చలపతిని కలుసుకున్నారు. పార్కులోకి తీసుకెళ్లి మాటాడారు.

"ఒక పక్కన వాత్సల్యం, మరో పక్కన స్నేహం—ఈ రెండూ నన్ను చిత్రవధ చేస్తున్నాయి చలపతి !" అన్నా రాయన గాద్గదికంగా.

"రాధ తెలివిగలది సీతారామయ్యగారూ ! ఆమె చేసుకున్న నిర్ణయాలమీద ఆమెకు నమ్మక ముంది." చలపతి ఇలా మాటాడ్డం చూసి ఆయన గతుక్కుమన్నారు.

"కాని ఆ శంకరం గురించి....."

"అతను అన్నివిధాలా యోగ్యుడు. ఆదర్శ వాది. ఆశయాలు చాలా ఉన్నాయతనికి. జీవితంలో వాటిని సాధించగలడనే నమ్మకమూ ఉంది. తాత ఇష్టాన్ని కాదనకండి."

"నీకు అన్నివిషయాలు తెలిశా యనుకుంటా"

"చాలావరకూ తెలిశాయి."

"నువ్వు రాధని ..... "

"వద్దు. ఆమె అభిరుచికి ఆటంకం కలిగించకండి. ఎదురుచెప్పినందుకు మన్నించండి సీతారామయ్యగారూ !"

ఆయనకళ్లల్లో నీళ్లు నిలిచాయి. లాలనగా అన్నా రాయన.

"నీకు దేవుడు మేలు చేస్తాడు చలపతీ ! మీ వాళ్ళని మరిపిస్తున్నావు. నిన్ను నా అల్లుడిగా చేసుకునేపాటి అదృష్టం నాకు లేదు. మమకారం నన్ను గెలిచింది. ఫలితం ఎలా ఉంటుందో మరి ?'

వేసవిసెలవుల్లో శంకరానికీ, రాధకీ పెళ్లి జరిగింది. ఆ పెళ్లికి అభినందనలు చాలా వచ్చాయి. ఆదర్శవివాహమని ఎంతోమంది పొగిడారు. ఆశీర్వదించారు. ముఖ్యంగా చలపతి ఆ పెళ్లికి సంతోషించాడు.

కాని—

కూతురుకాపురం పట్టుమని సంవత్సరమైనా కాకముందే సీతారామయ్యగారు గుండెజబ్బుతో స్వర్గస్థులయ్యారు. అప్పట్నుంచి చలపతి ఆ యింటికి కొంతవరకు రాకపోకలు తగ్గించుకున్నాడు. ఆ తర్వాతనే అనేక ప్రయత్నాల ఫలితంవల్ల విశాఖ పట్టణంలో ఉద్యోగం లభించింది.

ఈ మధ్యకాలంలో -చెప్పుకోదగ్గది—శంకరం పై చదువులు చదువుకోవడం, హోదా గల ఉద్యోగం సంపాయించడమూను.

చివరిదాకా కాలిన సిగరెట్టు అతని వేలిని కాల్చింది కసిగా. గతస్మృతులనుంచి అతను మేలుకున్నాడు. అయితే ఆ రాత్రంతా నిద్ర లేకుండా తెల్లవారడంగురించి ఎదురుచూస్తూనే గడిపాడు.

చలపతి ఆరోజు ఆఫీసుకి చాలా ఠీవిగా



వెళ్లాడు. ఆఫీసంటే తేలికభావం కలగటం అతని కదే మొదటిసారి. ప్రతిరోజూ అనుకునేవాడు—ఊరుకానిఊళ్లో, అందర్నీ వదలిపెట్టుకుని ఎన్నాళ్లిలా పొట్టచాకిరీ చెయ్యాలోగదాని. కాని ఈరోజు అదే ఆఫీసుమీద అతనికి జాలి పుట్టుకొచ్చింది. 'నువ్వు వాడిపోయేరోజు దాపున పడ్డదిలే' అని ఆఫీసునీ, దానితాలూకు గాలి పీల్చుకోడానికైనా వీలుదిక్కని వాతావరణాన్నీ గేలి చేశాడు లోలోన.

సీట్లో కూర్చుండబోతూండగా శేషగిరి తమాషాగా పలుకరించాడు కళ్లతో తన సీటుదగ్గరికి వస్తూ. చలపతి పెదాల్లో నవ్వు నిలిచింది ఆనంద సూచకంగా.

"ఎన్నాళ్లకి చూచాంరా నీ చిరునవ్వు .... నీ చిన్ననాటిమిత్రుడు ఆఫీసరుగా వస్తున్నాడంటే ఆనందించవలసిన విషయమే కానీ ...."

---

"ఏమిటిది!" అంటూ బిత్తర పోయాడు తలుపు తీసుకువచ్చిన మఠాధికారి, ఎదురుగా రివాల్వర్ గురిపెట్టి నుంచుని ఉన్న యువకుణ్ణి చూచి.

"అబ్బే ఏమీలేదు! నేను ఈ వేళే పోలీసు దళంలో చేరాను. నా రివాల్వర్ని ఆశీర్వదిస్తారని ఇటువచ్చాను." అన్నా డా యువకుడు వచ్చే నవ్వు ఆపుకుంటూ.

బి. సోమసుందరం (అనంతపురం)

---

"కానీ ఏమిటోయ్ మధ్య ?"

"ఈరోజులు మనమనుకున్నంత మంచివి కావురా చలపతీ ! మనిషిని పూసరివెళ్లిగా చిత్రించింది తరతరాలనుంచీ నడుస్తూన్న చరిత్ర ! కాబట్టి—అనుకోకూడదుగానీ — మన క్కాబోయే ఆఫీసరు నిన్ను చూసీ చూడనట్టు—"

"ఆపవోయ్ నీ మెట్టవేదాంతం. శంకరం సంగతి నాకంటే నీకేం తెలుసు. ఏం తెలుసునని నీకింత ధీమా ?"

"ఇన్నాళ్ళూ నువ్వనుభవించిన నరకం కళ్లారా చూచానుకాబట్టి నీకు మంచే జరగాలని కోరుకుంటాను. అన్నట్టు ఆయన యివ్వాళ సాయంత్రమే కదూ వస్తూంట."

"అవును."

"స్టేషనుకు వెడతావా ?"

"వెళ్లాలి మరి."

"మంచిది. ఈ వెధవ హస్కుతో నీ పని పాడు చెయ్యడం నా కిష్టమున్నా లేకపోయినా అవతల హెడ్క్లార్కు మండిపడగలడు. వస్తా" నంటూ అతని సీటులోకి వెళ్లిపోయాడు శేషగిరి.

చలపతి ఒకసారి ఆఫీసునంతా కలియజూశాడు. ప్రతి గుమాస్తా తనవంక కొత్తగా చూట్టం గమనించాడు. వాళ్లందరిలోనూ తను గొప్ప అదృష్టవంతుడిగా పూహించాడు. కాస్త గర్వించాడు గూడాను.

ఆరోజు చలపతికి పనిచేసినట్టనిపించలేదు.

ఇక్ష్వాకులవంశంనాటి ఆఫీసు గడియారం 'అయిదూ' అన్నది. చలపతి సీటులోంచి లేచాడు ఉషారుగా. ఫైళ్లు సర్దుకున్నాడు. గబగబా బయటకు నడిచాడు.

స్టేషనుకి వెళ్లేసరికి అయిదున్నరయింది. రైలు వచ్చేవేళ గూడా దాదాపు దగ్గర పడింది. ఒక్కో నిముషం గడుస్తూంటే అతడు శంకరం ఒక్కోఅడుగు దగ్గరపడుతున్నట్టు ఫీలవుతున్నాడు.

ఒకసారి ప్లాటుఫారమ్ని యీ కొసనుంచి ఆ కొసవరకూ గాలించాడు. మళ్లీ యింకోసారి అదేప్రయత్నానికి సిద్ధమవ్వబోతూండగా—మధ్యలో తక్కున బ్రేకు వేసినట్టు ఆగిపోయాడు.

అతనిక్కాస్త దూరంలో హెడ్క్లార్క్, మరో పదిమంది పెద్దమనుషులూ గుమిగూడటం గమనించాడు. వాళ్లల్లో చాలామంది స్థానికంగా పేరున్నవారూ, వ్యాపారాల్లో కొద్దో గొప్పో సంపాయిస్తూన్న వారూను. బహుశా వాళ్ళుగూడా శంకరానికి స్వాగతంచెప్పటానికే వచ్చిఉంటారని తలిచాడు.

అక్కడ చేరిన వ్యక్తులందరికీ, అలాంటి చాలా మందికీ—శంకరంలాటి ఆఫీసర్లతో పనులు చాలా ఉంటాయి. కొత్త ఆఫీసరనగానే వాళ్ల గుండెల్లో రైళ్లు పరుగెట్టడం మొదలెడ్తాయి. ఆయనకు స్వాగతంచెప్పటానికని చెప్పి, ఆ కాసేపట్లోనే సాధ్యమైనంతవరకూ ఆఫీసరుగారి 'మంచీ—చెడ్డా' తెలుసుకోడానికి ప్రయత్నిస్తారు. ఆయన కరుణ కటాక్షవీక్షణాల వరప్రసాదానికిది నాంది ముందు ముందు పీటితో పనులుంటాయి.

హెడ్క్లార్కు లౌక్యుడు. ఎత్తూ పల్లమూ తెలిసిన వ్యక్తి. పదిమందికీ తలలో నాలుకలాటి వాడు. అందరి జాతకాలూ ముఖం చూడగానే చెప్పగల సమర్థుడు. రిటైరు కావడానికి సిద్ధంగా ఉన్న హెడ్క్లార్కుకి యిలాంటి వర్తకాగ్రేసరులతోనూ—రాబోయే శంకరంలాటి కొత్త ఆఫీసర్లతోనూ పరిచయం జాస్తి. ఈ రెండు పార్టీలకీ మధ్యవర్తిగా ఆయన అనుభవం శ్లాఘనీయం !

వీళ్లందరూ చలపతికి కాస్త దూరంలో నిలబడి ఉన్నారు. వాళ్ల చేతుల్లో పూలమాల లున్నాయి, వాళ్ల ముఖాల్లో ఆందోళనలు కనుపిస్తున్నాయి.

ఏమిలేని చలపతి మనసు చివుక్కుమంది. ఆఫీసరుగా కాకపోయినా ఒక స్నేహితుణ్ని రిసీవ్ చేసుకోడానికి వట్టి చేతుల్తో వచ్చినందుకు అతనికి నామోషీ అనిపించింది.

ఏం చెయ్యగలడు ? చాలీ చాలని జీతంతో కుస్తీ పట్టడం నేర్చుకున్నాడు యిన్నాళ్లు. అదొక్కటే అతనికి చేతనయింది. ఇంటిదగ్గర తనవాళ్లనందర్నీ గుర్తు తెచ్చుకున్న మీదట గానీ తాను ఖర్చుపెట్టుకో గూడదు. అంతేగాని 'నా చిన్ని

వీట్నికు శ్రీరామరక్ష' అంటే అది ద్రోహ మవుతుంది. పైగా తనమీద ఆశలు పెట్టుకుని స్వర్గంలో ఉన్న తండ్రి ఆత్మ క్షోభిస్తుంది.

అలాంటప్పుడు తన దగ్గర మిగుల్చుకున్న డబ్బేముంటుంది, మిత్రుడికీ, యీనాటి ఆఫీసరుకీ కానుకగా, ప్రేమ చిహ్నంగా సమర్పించుకునేందుకు"

రైలు ప్లాటుఫారం మీదికి వచ్చి ఆగింది.

హెడ్ గుమాస్తా, ఆయన అనుచరులూ, జనంతో కలియబడి తోసుకుంటూ వెళ్లారు. ప్రతి కంపార్టుమెంటునీ అతి శ్రద్ధగా వెతకటం ప్రారంభించారు. చలపతి కూడా వెళ్లటానికి సంసిద్ధుడయ్యాడు గానీ, ఆ ముఠా ఎదుట తనకీ, శంకరానికీ గల స్నేహాన్ని తెలియపరచకూడదని అక్కడే ఆగిపోయాడు. పైగా హెడ్‌క్లార్కుకి తనమీద వల్లమాలిన ప్రేమలాటి ద్వేషం! చలపతి ఆయన కంటికో నలుసు!

గబగబా నడుస్తున్న హెడ్‌క్లార్కు ఒక కంపార్టుమెంటు ముందు ఆగిపోయాడు. వందిమాగధులూ ఆగిపోయారు. హెడ్‌క్లార్కు నవ్వు ముఖం నిండా కప్పుకుని చేతులు జోడించాడు వినయంగా. మిగిలినవారూ తూ. చ. తప్పకుండా హెడ్‌క్లార్కుని అనుసరించారు.

కంపార్టుమెంటు ఫుట్‌బోర్డుమీద శంకరం నిలబడ్డాడు హుందాగా. చలపతి కళ్లింతవి చేసుకుని తనివితీరా అతన్ని చూస్తుండిపోయాడు.

శంకరం యిప్పుడు ఎత్తుకి తగ్గ లావయ్యాడు. అతనికి సూటు బాగా నప్పింది. చేతిలోని సిగరెట్టు పొగలు కక్కుతుంది. కొత్త అలంకారమైన కళ్లజోడు అతని అందాన్ని మరింతచేసి చాటుతోంది

హెడ్‌క్లార్కు చేతిలోని దండ శంకరం మెడలో అలంకరింపబడింది. తదితరుల తాలూకు దండలు కూడా అదే స్థానాన్ని అలంకరించాయి. తరాత్వ అందరూ కలిసి గబగబా చప్పట్లు చరిచారు.

హెడ్‌క్లార్కు బృందం నుంచి మళ్లీ నమస్కారాలు ప్రయోగింపబడ్డాయి. అవి రాధకి చెందుతాయి. శంకరం పక్కన కుందనబ్బొమ్మలా నిలబడ్డ రాధ అందరికీ నవ్వుతూ ప్రతి నమస్కారం చేసింది.

ఆతర్వాత అక్కడ చేరిన 'తలల' ను గురించి హెడ్‌క్లార్కు పరిచయ వాక్యాలు ప్రారంభించాడు. వారి వ్యాపారాలను అతి క్లుప్తంగా, అర్థమయ్యేలా ఆఫీసరుకు విన్నవించుకున్నాడు.

ఈ తతంగమంతా ముగిసింతర్వాత హెడ్‌క్లార్కు శంకరం దంపతులకు దారి చూపిస్తూ తీసుకు వెడుతున్నాడు బయటికి. బృందం వాళ్లననుసరించింది.

చలపతి వాళ్లని చేరుకోవాలని గబగబా నడిచాడు జనాన్ని పక్కకు తోసుకుంటూ. కాని—వాళ్లందరూ కార్లెక్కి, కార్లు కదిలిం తర్వాత గాని తన ప్రయత్నం నేరవేరలేదు. శంకరాన్ని పేరుపెట్టి పిలవాలా వద్దా అని సందిగ్ధంలో ఉండగానే కారులు కదిలాయి.

హతాశుడై రూంకి తిరిగి వెళ్లేడు.

—తెల్లవారింది. ఆదివారం.

స్నానం ముగించుకుని శంకరానికి కేటాయించిన బంగళావైపు నడక ప్రారంభించాడు చలపతి. దార్లో తన పాత ఆఫీసరుగారి కారు ఎదురుపడింది. బహుశా ఆయన శంకరాన్ని పరామర్శించి వస్తున్నారు కాబో లనుకున్నాడు చలపతి.

శంకరం గురించీ, రాధ గురించీ ఆలోచించుకుంటూనే చలపతి బంగళా చేరుకున్నాడు. ఆ గేటును దాటారు నవ్వుకుంటూ హెడ్‌క్లార్కూ, పానకాలూను. చలపతిని అక్కడ చూడగానే హెడ్‌క్లార్కు ముఖం పాలిపోయింది. అయినా తమాయించుకున్నాడు. ఆయనే చలపతిని అడిగారు.

"ఏం నాయనా! ఇంత ఉదయమే దయ చేశావ్ ?"

"ఆఫీసరుగారి కోసం."

"తెలుస్తూనే ఉంది. కాని ఆయ నిప్పుడు బయట కెళ్లబోతున్నారు."

"పర్వాలేదు నన్ను చూస్తే. ఆగిపోతారు."

---

"నువ్వంటే నీ భర్తకు విసుగు కలిగిందని ఎందుకనుకుంటున్నావు? అనునయంగా అడిగాడు జడ్జీ విడాకులు కోరుతూ దరఖాస్తు పెట్టుకున్న ఒక అమ్మాయిని.

"ఏడు ఏళ్ల నుంచీ ఆయన ఇంటికే రావటం లేదు" కళ్లుతుడుచుకుంటూ ఆమె సమాధానం చెప్పింది.

ఎస్. మంగతాయారు (ఏలూరు)

---

"అలాగా .... సారి .... వెళ్లిరా" అన్నాడు. హెడ్‌క్లార్కు ముఖం చించుకుంటూ.

చలపతి రెండడుగులు ముందుకు వేయగా పానకాలు లోపాయికారీగా హెడ్‌క్లార్కుతో ఏదో గొణిగాడు.

"ఇతగాడికి ఆఫీసరు చిన్ననాటి మిత్రుడట. ఇతగాడు కుచేలుడు. ఆయనగారు శ్రీకృష్ణ పరమాత్మను. సరిపోయిందిలేండి జత." కసిగా అన్నాడు హెడ్‌క్లార్కు.

పానకాలు వెకిలిగా నవ్వాడు.

హెడ్‌క్లార్కు సహృదయతను యీ రెండేళ్లలో బాగా అర్థం చేసుకున్న చలపతి—అతని వ్యంగ్యాన్ని దులుపుకున్నాడు. ఇక పోతే యీ పానకాలనబడే వ్యక్తికి నాలుగైదు హోల్‌సేల్ పచారీ దుకాణా లున్నాయి. వ్యాపారంలో కిటుకూ, లాంఛనాలూ వగైరాలు బాగా వంట పట్టించుకుని తన జాతి పదిమంది పెద్ద మనుషులలోనూ 'భళీ' అనిపించుకున్నాడు.

ఇలాంటి వ్యక్తులంటే చలపతికి చిరాకు. వాళ్ల మాట అసలు పట్టించుకోలే దతను.

వరండా మెట్లెక్కి ఆగిపోయాడు చలపతి.

ఇప్పుడు శంకరాన్నేమని పిలవాలి ? ఇప్పుడిదొక సమస్యైపోయిందతనికి. అటూ యిటూ పరకాయించి చూశాడు. ఆవరణంతా నిశ్శబ్దంగా ఉంది. రేడియో సంగీతం చిన్నగా వినిపిస్తోంది. అత నలాగే మవునంగా నిలబడిపోయి ఉన్నాడు. ఇంతలో అక్కడ ఖంగున ఎవరో దగ్గినట్టు గమనించాడు. అటువైపు చూశాడు. ఆఫీసు జవాను రాజన్న వస్తున్నాడు. చలపతిని రాజన్న చూశాడు.

"ఆఫీసరున్నారా రాజన్నా ?"

"వుండారు బాబూ. మేడమీ దున్నారు."

"ఆహా .... "

"మీ రొచ్చారని చెప్పమంటారా ?"

"ఆ .... వద్దు .... పర్వాలేదు .... "

చలపతి గుమ్మంలోకి అడుగు పెట్టాడు. లోనికి తొంగిచూశాడు. చేతిలో ఏదో నవల పెట్టుకుని రాధ పక్క గదిలోంచి వచ్చింది.. చలపతిని చూసి అలాగే నిలబడిపోయింది. నోటి నుంచి మాట పెగిలి బయటకు రాలేదు. చలపతికి ఆమెలో పెద్ద మార్పు వచ్చినట్టు కనిపించలేదు. అప్పటిలాగానే యిప్పటిగ్గూడా రాధకి సాదారంగు చీరలంటే యిష్టం కాబోలు. మెడలో అందమైన వంటిపేట గొలుసున్నది. రాధ కిదివరకు రెండు జడలుండేవి. ఒక జడ ఎప్పుడూ ముందు భాగంలో ఉండేది. కాని యిప్పుడా అలంకరణ మారిపోయింది. ఇదే ఆమెలో కనుపించిన కొత్తదనం.

"చలపతిని రాధా!" అతను నిశ్శబ్దాన్ని భరించలేక అన్నాడు.

ఈ వింత సంబోధన రాజన్నని ఆశ్చర్యంలో ముంచేసింది. అతను యీ యిద్దరివైపూ కొన్ని క్షణాలు చిత్రంగా చూశాడు. తర్వాత నెమ్మదిగా బయట కెళ్లిపోయాడు.

"శంకరం మాకు ఆఫీసరుగా వచ్చాడు."

"ముందు ఆ సోఫాలో కూర్చో చలపతీ!" ఆమె అన్నది. తన ముందున్న సోఫాని చూపిస్తూ.

చలపతి కాస్త సిగ్గుతో కూర్చున్నాడు. రాధ కూడా కూర్చుంటూ చలపతితో అన్నది.

"ఇప్పుడు చెప్పు అన్ని విషయాలూ."

"రెండు సంవత్సరాల క్రితం యీ ఊళ్లో ఉద్యోగం దొరికింది నాకు. అమ్మావాళ్లంతా ఆ ఊళ్లోనే ఉన్నారు."

ఎందుకనిట ?"

"అమ్మని రమ్మన్నాను. కాని ఉన్న వూరుని వదిలిరావా లనిపించటం లేదన్నది. చివర్రోజులు ఆ గడ్డమీదనే గడపా లన్నది. పైగా పిల్లల చదువులు చెడిపోతాయని ఆమె నమ్మకం. వీటితో ఆమెదంతా ఒక పిచ్చి."

"బాగా మారిపోయావు చలపతీ !"

ఉన్నట్టుండి రాధ యిలా మాటాడేసరికి, అతను తనవైపు తనే చూచుకున్నాడు.

"ఇదివరకు కాస్త లావుగా ఉండేవాడివి. అన్నట్టు బొజ్జ కూడా ఉండే దనుకుంటాను వినాయకుడిలా" అని చిన్నగా నవ్విం దామె.

చలపతి ఆమె నవ్వుకి శృతి కలుపుతూ.

"హోటలు భోజనం ధర్మమా" ని అన్నాడు.

"అంటే నువ్వింకా పెళ్లి చేసుకోలేదా ?"

"లేదు. అయినా నాలాటి దౌర్భాగ్యుడ్ని పెళ్లి చేసుకున్నవాళ్ళు సుఖపడే దేముంది రాధా ! వచ్చే నాలుగు రాళ్ళూ మాకే చాలీ చాలనట్టుందాయె."

"మొదట్నుంచీ నువ్వు 'పెసిమిస్టు'వే."

"బాగా చెప్పావు రాధా ! మనిషి ఆశతోనే బ్రతకాలి. కాదనను. కాని అవకాశం కూడా కలిసి రావాలి గదా !"

"చాల్లే ఈ సంగతులకేం గాని — ఇంకేమైనా మంచి కబుర్లుంటే చెప్పు."

"చెప్పదగ్గ శుభవార్త నా దగ్గర ఒక్కటే ఉంది."

"ఏమిటది ?"

"శంకరం మాకు ఆఫీసరుగా రావటమే పెద్ద శుభవార్త. శంకరం దయవల్ల మావూరు చూస్తానే ఆశ నన్ను మళ్లీ మనిషిగా తయారుచేసింది రాధా !"

రాధ పేలవంగా నవ్వింది !

"ఇంతకుముందు ఆఫీసరు నాపై పెద్ద శ్రద్ధ తీసుకోలేదు. ఆయన పనేవిటో ఆయనేవిటో గాని నా బదిలీ గురించి ఆలోచించనేలే దసలు."

"ఊ బాగానే ఉంది. అందరం ఒక్కచోట చేరామన్నమాట."

"నిన్న మిమ్మల్ని కలుసుకోటానికి స్టేషన్‌కి వచ్చాను. కాని శంకరం చాలా బిజీగా ఉండిపోయాడు."

"అవును. పాపం చాలామందికి శ్రమ కలిగించారు. అప్పటి స్వాగతం యిప్పటివరకూ సాగుతూనే ఉంది. చాలామంది వచ్చారు, ఆయన్ను చూట్టానికి" ఆమె వ్యంగ్యాన్ని అర్థం చేసుకోలేక తత్తరపాటు చెందాడు చలపతి.

"అంటే?"

"నీకు తెలియందేముంది చలపతీ ! వాళ్లందరికీ ఏవో కొన్ని 'పనులం' టూ ఉంటాయి కదా! వచ్చినాయన కొత్త ఆఫీసరాయె. ఏ సమయం ఎలా ఉంటుందో నని కాస్త ముందుగానే వచ్చి పరామర్శించి వెళ్లారు.

"కాని రాధా ! నా విషయం అలా కాదు. స్నేహితుడ్ని ...."

"ప్రతి చిన్నవిషయానికీ అలా ఉలిక్కిపడతావే చలపతీ ! నీ సంగతి నాకు తెలియందికాదుగా" ఆమె నవ్వుతూ అన్నది.

అదే సమయంలో శంకరం సిగరెట్టు కాల్చుకుంటూ అందంగా, హుందాగా మేడ మెట్లు దిగుతూ 'రాధా' అని పిలిచాడు.

చలపతి శంకరాన్ని చూస్తూ లేచి నిలబడ్డాడు. కళ్లల్లో ఆనందం నింపుకుని శంకరాన్ని నఖశిఖపర్యంతం తనివితీరా చూస్తూ నిలబడ్డాడు.

"ఇక్కడే ఉన్నాను. చలపతి యింతకుముందే వచ్చాడు మీకోసం. ఇద్దరం బాతాఖానీ వేసుకున్నాం" అంది భర్తతో.

"చలపతా ?" తన పేరు తెలియనట్టు ముఖం చిట్లించి అడిగాడు శంకరం.

"అవును" అన్నది రాధ.

# ఎండమావులు

"అంటె ...."

చలపతి ముఖంలో కత్తివాటుకు నెత్తురు చుక్క లేదు. ముఖం వివర్ణమైపోయింది. ఇంతకుముందున్న నవ్వు స్థానాన్ని ఆశ్చర్యం ఆక్రమించింది. అతని నవనాడులూ అవమాన భారంతో కుంగిపోయాయి. ఏం మాటాడలేక తల దించేసుకున్నాడు.

"చలపతండీ .... మన చలపతి ...." రాధ ప్రయాస కూడా వృథా అయింది.

శంకరం నిర్లక్ష్యంగా చలపతిని చూశాడు. చలపతి సంబాళించుకుని అన్నాడు.

"మీ ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తున్నాను."

"ఐ .... సీ .... ఊఁ అయితే ?" అని అడిగాడు సిగరెట్టు పొగవయ్యారంగా వదులుతూ.

"మిమ్మల్ని చూద్దామని వచ్చాను."

"నీవు నిజంగా నిర్దోషివని తోస్తే, నీ తరఫున నేను తప్పకుండా వాదిస్తాను. ఇంతకూ నీవు అన్ని విషయాలు దాచకుండా చెప్పిన క్లేనా" అని అడిగాడు న్యాయవాది తన వద్దకు వచ్చిన ఖైదీని.

"డబ్బు దాచిపెట్టిన చోటు, తప్ప మిగతా అన్ని విషయాలు చెప్పాను బాబు" ఖైదు అమాయకంగా ఒప్పుకున్నాడు.

కె. లక్ష్మీపతి (భీమవరం)

"సారీ .... నాకు అర్జెంటుగా మరో ఎంగేజిమెంటున్నది. రే పెలాగైనా ఆఫీసులో అందర్నీ కలుసుకుంటాగా" అంటూ శంకరం బూట్ల శబ్దంతో గబగబా బయటి కెళ్లిపోయాడు.

చలపతి అచేతనుడై నిలబడిపోయాడు అతను వెళ్లిన వైపే చూస్తూ.

"చలపతీ!"

అతను రాధవైపు తిరిగాడు.

"బాధపడ్డావా ?" జాలిగా అడిగింది రాధ.

అతనేం చెప్పలేదు. ఆమె నిర్జీవంగా నవ్వింది.

"అతనిగురించి యింకా ముందు ముందు బాగా తెలుసుకుంటావ్ !"

"వస్తాను రాధా !"

చలపతి అక్కడ్నుంచి వెంటనే కదిలి, వేగంగా, పిచ్చిగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

గదిలో చాపమీద కుప్పలా కూలిపోయాడు.

ఇంతవరకూ శంకరం చలపతి మనోవీధిలో ఉదాత్తమైన రంగు పూసుకుని — ఆదర్శ యువకుడుగా నిలిచిపోయాడు. అతన్నలా చిత్రించుకోడంలో చలపతి చేసిన పొరపాటుకి కుమిలిపోయాడు. కాలేజీ రోజులూ, చలపతీ — శంకరానికి గుర్తు లేదంటే నవ్వాలో, ఏడవాలో గూడా అర్థంకాలేదు చలపతికి.

'మనిషి వూసరవిల్లి' అన్న శేషగిరి మాటలో నిజం యిప్పుడు బోధపడింది. అంతస్థూ — అధికారం మనిషిని లోకువ చేసుకుంటాయనే వాడుక ఎన్నో ప్రయోగాలు జరిగిన మీదటనే నిజమయి ఉంటుంది. ఆ క్షణంలో చలపతికి శంకరంపైన ఏహ్యభావం పుట్టుకొచ్చింది.

రాధలో మార్పు ఏమీ కనిపించలేదు గాని, ఆమె మానసికంగా కుమిలిపోతున్నట్టు ఆమె మాటాడిన కొద్ది సేపట్లోనే గ్రహించాడు చలపతి.

కొత్త ఆఫీసరుకు స్వాగతం, పాత ఆఫీసరుకి వీడ్కోలు యిచ్చారు ఆఫీసు బృందం. శంకరం డ్యూటీలో జాయినయ్యిన వారం రోజుల వరకూ యీ క్రొత్త ప్రభుత్వం ఎలా ఉంటుందో తలకో విధంగా వూహించిన మీదట — చివరికి అంతా ఒక నిశ్చయానికి వచ్చినట్టు కనిపించింది.

శంకరం లాంఛనాలు తూ. చ. తప్పని ఆఫీసరు !

చలపతి తన పనిని మవునంగా చేసుకుపోడం ఆఫీసు నంతటినీ కలవర పెట్టింది. అతను శంకరం గురించి చాలా చెప్పాడు. ఇప్పుడేమో ఏదీ పట్టించుకోనట్టు సంచరిస్తున్నాడు. దాన్లో ఉన్న రహస్యం తెలుసుకోవాలనే కోరిక ప్రతి గుమాస్తాని ఆవరించింది. కాని వాళ్లకి చూచాయిగా నైనా కారణం చెప్పేవాడు కాదు చలపతి.

హెడ్‌క్లార్కు యింత ముక్కుపొడుం దట్టించి చేతులు దులుపుకుంటూ, ముక్కు తుడుచుకుంటూ చలపతి సీటుకి వచ్చాడు. వెకిలిగా నవ్వుతూ అడిగాడు.

"ఆఫీసరు భార్య కూడా నీకు బాగా తెలుసునట. మన రాజన్న చెప్పాడులే !" చలపతి మవునంగా ఉండిపోయాడు.

"నీకూ, ఆఫీసరు కుటుంబానికీ ఉన్న స్నేహం మెచ్చుకోవచ్చు. కానీ—ఆఫీసరు నువ్వంటే బొత్తిగా యిష్టం లేనట్టు కనిపిస్తున్నా డేమిటోయ్ !"

చలపతి పేలవంగా నవ్వాడు.

"దాచకోయ్ చలపతీ ! నా కంతా తెలుసు. పెద్దవాళ్ల దగ్గర స్నేహాలూ, హృదయాలూ అని భాష వాడకు. చెడిపోతావ్. కుర్రవాడివి. జీవితం యింకా వంట పట్టలేదు నీకు !" ఆయన వ్యంగ్యంగా నవ్వాడు.

చలపతి తల దించుకున్నాడు.

హెడ్‌క్లార్కు అంటూన్న ప్రతి మాటనీ ఆలకిస్తున్నారు ఆఫీసు బృందం. కాని చలపతి నోటి నుంచి జవాబు రాకపోవటంతో హతాశులయ్యారు.

ఇంతలో పానకాలు రావటం పసిగట్టిన హెడ్‌క్లార్కు, నవ్వుని కొని తెచ్చిపెట్టుకుని బిగ్గరగా అన్నాడు.

"రండి. రండి. ఇప్పుడే అడిగారు ఆఫీసరు మీ గురించి. నేనూ ఎదురు చూస్తున్నా. పదండి

"వెడదాం" అంటూ పానకాలుని వెంట బెట్టుకుని ఆఫీసరు గదివైపు వెళ్ళిపోయాడు.

"వడ్డించేవాడు మనవాడైతే కడపంక్తిని కూర్చున్నా పర్వాలేదంటారు. ఇందుకే కాబోలు." చలపతి వెనుకసీటుని ఆక్రమించిన దామోదరం అన్నాడు. "చలపతి చెపితే నిజం కాబోలనుకున్నాం. ఆఫీసరు లాంఛనాలు తప్పని సరుకని మనకేం తెలుసు" అన్నాడు మరొకాయన ఆఫీసంతటికీ వినిపించేలా. అలా అతను గొంతు చించుకోడం చూచి దామోదరం భయపడ్తూ నెమ్మదిగా అతన్ని దండించాడు.

"ఉష్! గట్టిగా అరవకురా పీనుగా! అక్కడికి నువ్వేదో మడికట్టుకున్నట్టు వాగుతున్నావ్. నీ సంగతంతా ఆ వెంకటస్వామిగారి వల్ల బయటపడిందిలే. ఊడాయి పలక్కు."

"ఏడిశావు లేవోయ్ .... రాజే కక్కుర్తి పడుతున్నప్పుడు యిక మన మొహ లెఖ్ఖా! జమా! .... హి .... హి .... హే ...."

ఈ ధోరణి వింటూ చలపతి లోలోన విసుక్కున్నాడు. శంకరం యింత నీచస్థితికి దిగజారిపోవడం అతనికి బాధనిపించింది.

—నెల రోజులు గిర్రున తిరిగేసరికి శంకరం గురించి యింకా దారుణంగా వినాల్సి వచ్చింది. ఇంత త్వరగా శంకరం మారిపోగలడని చలపతి వూహించనైనా లేదు.

ఇప్పుడు చలపతిలో నిస్పృహ గూడు కట్టుకుని ఉంది. అతను అధికంగా ఎవర్తోనూ మాట్లాడడు. శంకరం రాకముందే చలపతి యింకాస్త వుషారుగా ఉండేవాడు. మాట్లాడిన కొద్ది సేపూ నవ్వుతూ మాట్లాడేవాడు. అలాంటి చలపతిలో యిప్పుడు నవ్వు దూరమయింది. ఎప్పుడూ దేని గురించో ఆలోచిస్తూ ఉంటాడు.

ఒకరోజు శేషగిరి చలపతి గది కొచ్చాడు. మాటా మంచీ ముగిసిం తర్వాత అతనే శంకరం విషయం తీసుకొచ్చాడు.

"నువ్వసలు యీ కాలానికి సమ్మంధించిన వ్యక్తివి కావురా చలపతీ! మనిషికి విలువనివ్వు. కాని దాన్ని దాచిపెట్టుకో! మొదట్లో నువ్వు శంకరంగురించి చెప్తూంటే నా కనిపించింది— ఎప్పటికైనా నువ్వు అవమానం చెందుతావని! కాబట్టి మనుషుల్నందర్నీ అతిగా నమ్మటం మంచిదికాదు. నమ్మితే నీ మనస్సులో పెట్టుకో. ఇప్పుడు చూడు ఆఫీసంతా నువ్వంటే చులకనగా చూస్తున్నారు. నువ్వసలు శంకరం గురించి చెప్పుకోకపోతే ఎంత బావుండేదో వూహించు."

"నా గురించి ఎవరే మనుకున్నా పర్వాలేదు గిరీ! కాని శంకరం యింత దౌర్భాగ్యానికి దిగజారడం మాత్రం నన్ను కలవర పెడ్తోంది. చెప్పానుగా కాలేజీ రోజుల్లో అతన్ని మేమంతా ఎంత గౌరవించేవాళ్లమో—అతనూ మమ్మల్ని అంతగా గౌరవిస్తూండేవాడు."

"ఇప్పుడేమయ్యాడు. ఢంకా వలాసుప్రియుడయ్యాడు, తాగుడు నేర్చాడు—ఒక్కటేమిటి అన్నీ నేర్చుకున్నాడు. ఇలా మారతాడని నువ్వానాడు అనుకోపోవడంలో ఆశ్చర్యంలేదు. ఆశయాలూ [illegible]టా కావలిసిందే. అయితే జీవితాంతం నిలబెట్టుకోగల మనోబలం మనిషికి కావాలి. అది యీనాడు చాలామందిలో లేదు. గమ్మత్తేమిటంటే—మనలో కొందరుంటారు— వాళ్లు 'ఇది నా ఆదర్శం' అని చెప్పుకోకుండానే ఆదర్శంతో బ్రతుకుతుంటారు. అలాంటివాళ్లు పదిమందిలో ప్రచారం ఆశించరు."

శేషగిరి మాటలు వింటూంటే చలపతికి సీతారామయ్యగారు గుర్తుకొచ్చారు.

"వద్దురా గిరీ! మనకీ పెద్ద మాటల్తో పని లేదు. ఇలాగే బ్రతుకుదాం! మళ్లీ నా వూరు చూచే భాగ్యం కరువయినా ఒక సత్యాన్ని తెలుసుకున్నాను. చాలిది నాకు."

శేషగిరి చలపతి స్థితిని అర్థం చేసుకున్న వాళ్లల్లో ముఖ్యుడు. అందుకే అతనికి చలపతంటే జాలి.

* * *

ఆఫీసులో తలవంచుకు పనిచేసుకుపోతూన్న చలపతిని ఆఫీసుజవాను రాజన్న పలకరించాడు. చెవిలో చెప్పినట్టు చాలా నెమ్మదిగా గొణిగాడు.

---

మొగుడు కొడుతున్నాడని రత్తాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

"ఏరా అది చెబుతున్నది నిజమేనా" గద్దించి అడిగాడు మల్లిగాడిని పోలీసు అధికారి.

"శుద్ధ అబద్ధం బాబు! నేను కొట్టింది దాన్ని కాదు. అది తాగి అట్లా చెబుతోంది" మల్లిగాడు బుకాయించాడు.

వి. హనుమంతరావు (హైదరాబాదు)

---

"ఆఫీ సయింతర్వాత మిమ్మల్నొకసారి అమ్మగారు రమ్మన్నారు బాబూ!"

ఎందుకన్నట్టు అతని వైపు చూచాడు చలపతి.

"మీతో చాలా విషయాలు మాటాడాలంట.'

ఈ రెండు ముక్కలూ చెప్పి రాజన్న గబగబా బయటకు వెళ్లిపోయాడు ఏదో పని ఉన్నవాడిలా. రాజన్న చలపతికి చెప్పిం దేవిటో తెలుసుకోవాలన్న ఉబలాటంకొద్దీ — గుమాస్తాలందరూ చలపతి వైపు కళ్లప్పగించి చూస్తున్నారు. వాళ్ల దుస్థితికి చలపతి విచారించాడు.

రాధ అకస్మాత్తుగా చలపతికి గుర్తు వచ్చింది. తండ్రి ఎంత చెప్పినా వినలేదు. శంకరాన్ని, అతని ఆశయాల్నీ నమ్మింది. మనసిచ్చింది. పెళ్లి చేసుకుంది. ఈనాటి శంకరాన్ని, ఆనాటి శంకరంతో పోల్చి చూసుకుని కుమిలిపోతూంటుంది బహుశా.

ఈ ఊళ్లో తొలిగా రాధని చలపతి చూచినప్పుడు ఆమెలో ఏదో అవ్యక్తమైన బాధ గమనించాడు. అందుక్కారణం శంకరం ప్రవర్తనే ననే నమ్మకం చలపతికి ధృవపడింది.

ఆ సాయంత్రం రాధని చూచి రావాలని నిశ్చయించుకున్నాడు చలపతి.

ఆఫీసరు గదిలో పానకాలు రాలుగాయి కంఠం గట్టిగా నవ్వింది! హెడ్‌క్లార్కు వళ్లంతా కదుపుకుంటూ ఆ గదిలోంచి బయట కొచ్చాడు. తన సీట్లో కూర్చుంటూ చలపతిని పిలిచాడు. చలపతి ఆయన సీటు దగ్గరికి వెడుతూ అనుకున్నాడు ఏదో విడ్డూరం జరిగిం దనుకుంటూ.

"అదికాదు చలపతీ! నీ కెన్నిసార్లు చెప్పాలి? పానకాలుగారి కాగితాలేవో చూడమని పదిసార్లయినా చెప్పానా? నువ్వసలు వినిపించుకున్న పాపాన పోతేనా? ఇప్పుడు చూడు. ఆఫీసరు నామీద ఫైరవుతున్నాడు. అబ్బెబ్బే, నీ పద్ధతేం బాగోలేదోయ్."

చలపతి నిశ్చేష్టుడయ్యాడు. పానకాలు కాగితాల గురించి తన కింతవరకూ చెప్పనేలేదు. ఇదంతా చూస్తుంటే చిన్నప్పుడు చదివిన "మేకపిల్లా—తోడేలు" కథ గుర్తుకొచ్చింది చలపతికి!

"నువ్వు రేపట్నుంచి గుర్నాథంగారి సీటు పని చూచుకోవాలిట. ఇది ఆఫీసరుగారి ఆజ్ఞ. మారాజా, మంచివారు గాబట్టి నిన్నేమనలేక సీటు మాత్రం మార్చారు. మరొకళ్లయితే .... ఇవన్నీ నా కెందుగ్గాని రేపట్నుంచి గుర్నాథంగారి పని చూసుకో. వెళ్లు" అన్నారు హెడ్‌క్లార్కు.

చలపతి బిత్తరపోయాడు. కొద్ది కొద్దిగా తన సీటు మార్పిడికి కారణాలు అవగత మవుతున్నాయి. కొన్ని కొన్ని 'పనులు' కొందరి వ్యక్తుల వరకే పరిమితమై ఉంటాయి. ఇదంతా రాచరికం తీసుకున్న రాజుగారి అభిప్రాయాల కనుగుణంగా మార్చుకోబడుతాయి.

శంకరం చేస్తూన్న నిర్ణయాలు నీచంగా కనుపించాయి చలపతికి. ఆఫీ సయిం తర్వాత శేషగిరి చలపతితో అన్నాడు: "నువ్వు వట్టి అమాయకుడివిరా చలపతీ! అందరూ నిన్ను చులకన చేస్తున్నారు."

చలపతి గది చేరుకున్నాడు నీరసంగా. శంకరం పైన కోపం ముంచుకొచ్చింది. హెడ్‌క్లార్కు వక్కజిత్తులకి అసహ్యించుకున్నాడు.

"వీళ్లందరూ మనుషులేనా?" అని అనుకున్నాడు. అప్పటి కప్పుడే తల్లికి ఉత్తరం రాశాడు.

అమ్మకి,

నా స్నేహితుడే నాకు ఆఫీసరుగా వస్తున్నాడంటే సంతోషించాను. మీకు దగ్గర్లో ఉండి ఉద్యోగం చేసుకునేపాటి అదృష్టం కలుగబోతూందని మురిసిపోయాను. నే ననుకున్నదంతా వట్టిదయింది. దారుణమైన ఫలితాలు నన్ను ఆవరించాయి. ఇంతలో మీ పాదాలదగ్గరగా పనిచేసుకునే భాగ్యం నాకు లేదు. చెల్లాయినీ, తమ్ముణ్ణీ బాగా చదువుకోమని చెప్పు. ఎప్పటిలాగానే మీకు డబ్బు పంపుతూంటాను. ఆ ధైర్యం యింకా చావలేదు.

నమస్కారములతో
చలపతి.

ఉత్తరం పోస్టు చెయ్యడానికని బయటకొచ్చిన చలపతిని రాజన్న అంతదూరం నుంచే పిలిచాడు. చలపతి ఆగిపోయాడు.

"అమ్మగారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మంటున్నారు."

"ఎందుకు ?"

"ఏమోనండి ! ఇప్పటిదాకా మీ కోసం ఎదురు చూచారు. మీ రాకపోతే మళ్లీ పిలుచుకురమ్మని పంపారు. వెంటనే ఉన్నపళంగా రమ్మన్నారు."

చలపతి కాదనలేక రాజన్న వెంట వెళ్లాడు.

బంగళా ఆవరణలో చలపతిని చూచిన రాధ, గబగబా ఎదురుగా వచ్చి అతన్ని ఆహ్వానించింది. లోపలికి వెడుతూ అంది.

"బొత్తిగా నల్లపూసవై పోయావేం చలపతీ ?"

".... .... .... .... ...."

"అలా కూర్చో కాఫీ తీసుకొస్తాను" అంటూ ఆమె కాఫీ తీసుకురావడానికి వెళ్లింది. చలపతి సోఫాలో బెరుగ్గా కూర్చున్నాడు. ఏదో మాగజైను తీసుకుని పేజీలు తిప్పడం మొదలుపెట్టాడు. మనసు మాత్రం రాధ చెప్పబోయే విషయాలను వూహిస్తూంది.

రాధ కాఫీ అతని కిస్తూ అంది.

"నామీద కోపం వచ్చిందా ?"

"అబ్బే నా కెందుకూ కోపం ?"

"మనం కొన్ని పొరపాట్లు చేజేతులా చేసుకుని ఫలితానికి విచారించటం వివేకమంటావా చలపతి?"

అతడా ప్రశ్నకు జవాబు యివ్వలేదు.

"నా చిన్నతనం గురించి ఆలోచిస్తూంటే కాలేజీ రోజులు నాకు బహుసుందరంగా కనిపిస్తాయి. అప్పుడే పొరపాటు చేశాను" ఆమె గాద్గదికంగా అన్నది.

"నిజంగా పొరపాటు జరిగిపోయింది చలపతీ ! నాన్న నీ గురించి చెప్పారు. నువ్వంటే నాకు అభిమానమే — కాని—శంకరం నన్ను ఆకర్షించాడు. అతని ప్రవర్తన నా కళ్లు కప్పింది."

"ఇప్పు డివన్నీ ఎందుకు "

"స్వర్గాన ఉన్న నాన్న నాకు అనుక్షణం గుర్తుకొస్తూంటారు. నేను ఓడిపోయానని హెచ్చరిస్తూంటారు. ప్రేమించి పెళ్లిచేసుకోడం మంచిదే. దానికి యోచన కావాలి చలపతి ! శంకరంలో తప్పు ఆనాడు కనిపించలేదు. పైగా మనం అభిమానిస్తున్న వ్యక్తిలో తప్పు వెదకటం అంత తెలివైనపని కాదు."

"మా నాన్న బ్రతికుంటె ఆయన పాదాలు తాకి మనసులో గూడు కట్టుకున్న బరువంతా తీరిపోయేలా వలవలా ఏడవా లనిపిస్తుంది. ఆయన లేరు. సన్నిహితులైన వాళ్లల్లో నువ్వు ఒక్కడివే కనుపిస్తున్నావ్. నా బాధంతా నీతో చెప్పుకోవాలని ఉంటుంది. కాని .... ఆరోజు .... నాముందే అవమానం చెందిన నువ్వు మళ్లీ నాకోసం వస్తావనుకోలేదు.

"పదిమంది మధ్యనా శంకరం నన్ను గౌరవిస్తాడు. మేము ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆదర్శ దంపతులమనీ, మా మధ్య పొరపొచ్చా లసలు లేవని అందర్నీ నమ్మిస్తాడు. అందరిముందూ

# ఎండమావులు

వలకబోస్తున్న అనురాగం నాకీ యింట్లో ఆయన ముందు లభించడంలేదు. ఆయన వ్యవహారాల్లో నేను జోక్యం కల్పించుకోకూడదు. నన్ను బానిసలా చూడటం నేర్చుకున్నాడు. ఇదీ చలపతి ! మా పెళ్లికి జరుగుతున్న ప్రతిఫలం !"

చలపతి హృదయం ద్రవించింది. టీపాయ్ మీద కాఫీ అలాగే ఉండిపోయింది.

"పాపిష్టిదాన్ని .... నా గొడవ చెప్పుకోవటమే సరిపోయింది. ముందు , కాఫీ తాగు చల్లారిపోతుంది" అన్నది.

అతను కాఫీ తీసుకున్నాడు.

"నీలాంటి స్నేహితులతో మనసు విప్పుకు మాటాడాలని ఉంటుంది. కాని నాకు ఆయన అందుకు అవకాశ మివ్వరు. కాలేజీ రోజుల్లో నాకున్న స్వేచ్ఛ యిప్పుడు లేదు. నే నెవరితో

"మీ ఇల్లు దోచుకున్నవా రెవరో మీకు తెలుసా?" పోలీసులు నారాయణమ్మగారిని అడిగారు.

"మహాచక్కగా తెలుసు! అయినా మీ అంతట మీరే కనుక్కోండి చూద్దాం" నారాయణమ్మగారు సవాలువిసిరారు.

బి. సి. పద్మనాభశర్మ (గుంతకల్లు)

పైనా మాటాడటం ఆయన చూస్తే ఏదో 'గిల్టీ'గా ఫీలవుతాడు. నన్ను ప్రేమించి పెళ్లి చేసుకొనక ముందు, యిదే ప్రవర్తన అభినందనల పాలయింది.

"తను చేసేది తప్పని తెలిసి గూడా దిద్దుకోలేని మనస్తత్వం ఆయినది. మనోబలం రానురాను క్షీణిస్తుంది. శంకరాన్ని దేవుడు కూడా క్షమించలేడు చలపతీ .... నువ్విక్కడికి వచ్చిన రోజున నావల్ల నీ మనసు బాధపడితే క్షమించు."

"ఛ .... ఆవేం మాటలు రాధా !—— నేనానాడే గ్రహించాను మీ మధ్య అఘాతం .....మరింక వస్తాను" అంటూ చలపతి లేచాడు.

త్యాగం చేసింది నువ్వు — ఆశయమని మభ్యపెట్టింది శంకరం" ఆమె యీ మాటకి అతను ఆశ్చర్యపోయాడు.

"నిజం చలపతీ ! ఒక లక్షాధికారి బిడ్డని, అవకాశమేర్పడినా, ఆమె సుఖాన్ని ఆశించి పెళ్లి చేసుకోలేనని చెప్పిన మనిషి దేవుడు."

చలపతి ముఖాన్ని పక్కకి తిప్పుకున్నాడు.

"ఎప్పుడైనా వీలు చిక్కితే యిటువైపురా. మన రెండు కుటుంబాల మధ్య ఉన్న స్నేహం మనం అంత త్వరగా మరచిపోకూడదని ఆశిస్తాను" ఆమె లేచి నిలబడుతూ అన్నది.

చలపతితోపాటు వరండా మెట్ల వరకూ రాధ వచ్చింది. అదే సమయంలో శంకరం యింటికొచ్చాడు. చలపతి వైపు కోపంగా చూస్తూ అడిగాడు.

"నీ కిక్కడేం పని ?"

".... .... .... ...."

"చెప్పవేం జవాబు."

"నేనే రమ్మని కబురంపాను." రాధ నెమ్మదిగా జవాబు చెప్పింది.

"కబురంపుతావ్. అన్నీ తెలుసు నాకు. ఆఫీసంతా మీ గురించే అనుకొంటున్నారు. ఛీ .... సిగ్గు లేకపోతే సరి. ముందు నువ్వు లోపలికి వెళ్లు" అన్నాడు రాధని విసుక్కుంటూ.

చలపతి మనసు చివుక్కుమంది. అతను మెట్లు దిగి గబగబా వెళ్లబోయాడు. కాని శంకరం అంటూన్న మాటలు వింటూ ఆగిపోయాడు.

"అసలీ గుమ్మం తొక్కటానికి నీ కెవడిచ్చాడు అధికారం ? వెళ్లిక్కడ్నుంచి. మర్యాద బొత్తిగా తెలియని బ్రూట్స్. మరోకసారి యీ యింటి పరిసరాల్లో కనుపిస్తే నే సహించేదిలేదు. ఎంతలో ఉండాలో అంతలోనే ఉండు." ఒక పురుగుని చూచినట్టు, చలపతివైపు చూస్తూ అన్నాడు శంకరం.

"బాగా మారిపోయావు శంకరం ! ఈమాటలనిపించేది నీ అంతస్తు. కాని .... ఈ అంతస్తు నీకు సుఖాన్ని యివ్వదు. ఇదిమాత్రం మరిచిపోకు" చలపతికి ఆ క్షణాన్ని ధైర్యం కలిగింది. ఇన్నాళ్లనుంచీ తను శంకరానికి హెచ్చరించా లనుకున్న రెండు మాటల్నీ, పరిసరాలనీ, తువనీ మరిచిపోయి అన్నాడు.

శంకరం అహం దెబ్బతింది. చలపతి చెంప చెళ్లుమంది !

"యూ స్కౌండ్రల్ .... గెటవుట్ ...." బిగ్గరగా అరిచాడు శంకరం. రాధ చలపతి వైపు చూడలేక కళ్లు మూసుకుంది.

రెండు క్షణాలు దీనంగా, నిశ్శబ్దంగా గడిచాయి. చలపతి రెండు మెట్లు దిగాడు. వెళ్లబోతూ గంభీరంగా అన్నాడు—

"ఇంత చక్కటి సంస్కారం నేర్చుకున్నందుకు నాకు చాలా విచారంగా ఉంది. నిన్ను చుట్టూ ఆవరించిన అంధకారం త్వరలో తొలగిపోవాలని ఆశిస్తున్నా."

చలపతి వెళ్లిపోయాడు.

* * *

సరిగ్గా యిది జరిగిన రెండోనాటి సాయంత్రం ఆఫీసంతా అనుకున్న దిది : చలపతిని శ్రీకాకుళం జిల్లాకు ట్రాన్స్‌ఫర్ చెయ్యటానికి కొత్త ఆఫీసరైన మాజీ ఆదర్శ యువకుడు శంకరం ప్రయత్నాల్లో ఉన్నాడట. ★